# బెదురు

నువ్వు వాడితో దెబ్బలాళ్లేవు. "ఆడగల నంటావా?! అయితే ఆడు! దెబ్బలాడు!" నా కభ్యంతరం లేదు. ఎలక వెళ్ళి గజరాజుతోనూ దెబ్బలాడొచ్చు. మృగరాజుతోనూ దెబ్బలాడొచ్చు! "ఆడతానంటే ఎవడి కభ్యంతరం? అలాగే నువ్వూను. నీ దెబ్బలాటకి ఓ ప్రయోజనం అంటూ వుండాలా ఉండొద్దా? ఉంది కద! మరైతే ఏఁవిఁటా ప్రయోజనం? వెళ్ళి దెబ్బలాడి, వాణ్ణి జయిద్దాఁవఁ నేనా నీ ఉద్దేశం? అదేనా? వాణ్ని నువ్వుకాదు. నిన్ను పుట్టించిన జేజమ్మ దిగొచ్చినా ఏం చెయ్యలేడు. తల వెంట్రుకలో అరసగం తెంపలేరు వారు. తల వెంట్రుకల్ని ఊదిపారేసినట్టు వాడే నిన్ను నీ జేజెమ్మనీ ఊదించి పారేసి ఊకతోపాటు తగలెట్టించీగలడు! మిమ్మల్ని తన్ని తగలీడానికి వాడు రానక్కర్లేదు. ఓ బోడిముండ నెవరైనా పమ్మించి మిమ్మల్ని దాన్చేత ఓ పాతు పాతించీగల్డు! అంతకంటె ఎక్కువ శ్రమక్కర్లేదు ఆ బాబుకి! వాణ్ణి వెళ్ళి ద్వంద్వ యుద్ధానికి రమ్మని పిల్చి, సిగాసిగా పట్టుకొని పీకులాడి యుద్ధంచేసి, నీ బలం ఎక్కువైతే, వాణ్ణి చిత్తుచేసేసి వీరుణ్ణని చెప్పి విజయఢంకా కాదు - తోలు డప్పు మీద దెబ్బేసి చెప్పడానికి ఇదేం ఆదిమానవుడి రాతియుగం అనుకున్నావా ఏఁవిఁటి?! కాదు బాబూ కాదు, ఆ కాలం ఏనాడో వెళ్ళిపోయింది. మనిషి తెలివి తేటల్తోపాటు మారణాయుధాలు కూడా పెరిగాయి. నువ్వు గెడ్డాలూ మీసాలూ పెంచేసి నలుగురు కోతి వెధవల్లాంటి కొండ వెధవల్ని వెంటేసుకొని మూరెడు విల్లూ బారెడు బాణం పట్టుకొని అడివిలోంచి జంతువులు దిగినట్టు రంగంలోకి దిగితే నీ ముక్కుమీది కోపానికీ నీ బారెడు బొక్కిబాణానికీ కంచుకోటలు విడిపోతాయనుకున్నావా, బ్రహ్మాస్త్రాల్లాంటి అస్త్రాలు భయపడి పారిపోతాయనుకున్నావా?! నీకోసం సత్యంలో కొంతసేపూ, ధర్మంలో మరి కొంతసేపూ ములిగొచ్చి నువ్వుల నూనెలో ముంచితీసి ముట్టించిన కంచు కాగడాలు - ధర్మజ్వాలగా ధగధగ వెలుగుతుంది కాబట్టి, నీ ధర్మశక్తితో కొండల్ని పిండి చేసేయగలనను కొందికి ఇదేం పురాణ పురుషుల పాతకాలం అనుకొన్నావా?! నీ ధర్మబలానికి కొండలు పిండికావు, నీ దమ్మిడీ కాగడాకి కంచు కవచాలూ, ఇనప తొడుగులూ మండి మసైపోవు. దెబ్బలాటకి మందిబలం జబ్బబలం ఉంటే సరిపోతుందనుకొందికి అక్కడ మనుష్యులు రాతికాలపు మూర్ఖపు రాక్షసులు కారు? నువ్వు కోటిమంది కొండ వెధవల్ని తీసుకువెళ్ళినా లాభం వుండదు. కోట బురుజు వెనక ఒక్కడు కూర్చొని ఒక్క అస్త్రం ఒదిలాడంటే నీ కోటిమంది ఎక్కడా కనిపించరు. ఇలా జరిగిందర్రో అని ఇంటికి పోయి భోగట్టా చెప్పడానిక్కూడా ఎవడూ మిగల్డు. మహా మారణాయుధాల ముందు నీబోడి మానవశక్తి ఏం చెయ్యగలదురా బాబూ?! ఏమీ చెయ్యలేదు.

వాళ్ళెవరో తెలుసా? వాళ్ళు మహాచక్రవర్తుల్ని మించినవాళ్లు. ముల్లోకాల్లోనూ మానవ చరిత్రలో ఇంతవరకూ అంతటి బలమైనవారు కాగడావేసి వెతికినా ఎక్కడా కనిపించరు! భూ ప్రపంచంలో వాడి వజ్ర సైనికులు వెళ్ళి జ.యించుకురాని ప్రదేశం బెత్తెడు లేదు. ఒక్క అస్త్రం విసిరేరూ అంటే ఒకటిన్నర లోకాలు మాడి చచ్చి ఊరుకుంటాయేగాని వాటికి మళ్ళీ మారుజన్మంటూ ఉండదు. అలాంటి వజ్ర సైనికులు లక్షలమందున్నారు వాడికి. అలాంటి మారణాస్త్రాలు కోట్లున్నాయి వాళ్ళకి! అలాంటి వాళ్ళని నువ్వూ నీ కొంటె ముండల బొచ్చు మొగుళ్ళూ వెళ్ళి జయించుకొచ్చేద్దాం(ఁ)అనే నీ అభిప్రాయం?! వెర్రివాడా వెర్రాశలూ అపోహలూ పెట్టుకొని పీకలమీదికి తెచ్చుకోకు. వెళ్ళి వాడితో సంప్రదింపులు చెయ్యి. అక్కడ పంచాయితీ పెట్టించు, వెళ్ళి వెక్కివెక్కి ఏడ్చి వాడి మనసూ వాళ్ళ మనసులూ మంచికి మార్చడానికి ప్రయత్నం చెయ్యి. అంతేకాని దౌర్జన్యంగా వెళ్ళి వాణ్ని హతమారుస్తాననంటే వాడు నీకంటే దౌర్జన్యం చెయ్యగల్డు, నువ్వూ నీ బొచ్చు మనుష్యులూ బాణాలు పట్టుకుని అటుకులు నవుల్తూ బయల్దేరుతాం(ఁ)వంటారా! బయల్దేరండి! వాడు మాత్రం బయల్దేరడు. మంత్రించి ఒదిల్నట్టు వాడి పెరట్లోంచే ఓ బొక్కి బంట్రోతెవడో ఓ బ్రహ్మాస్త్రంలాంటి అస్త్రం వదుల్తాడు. అది మీకు ఎట్నుంచి వచ్చిందో తెలీదు. ఎప్పుడొచ్చిందో తెలీదు. ఎలా మండిందో తెలీదు. తెలుసుకునే లోపున మీరంతా మాడి చావనే చస్తారు. "తెలిసిందిరా నాయనా, అదీ సంగతి. మారణాయుధాల మహిమ సంగతి తెలియక ఏదో పెద్ద మహితాత్ముణ్ణి, ధర్మాత్ముణ్ని అనుకొంటూ విర్రవీగి మీసాలూ, గెడ్డాలూ దువ్వుకొంటూ ముందుకి దూకి ఆ మారణహోమంలో పడిపోయి మాడి చావకు?!"

అని ఎవరో పెద్దమనిషొచ్చి ఎంత చెప్పినా ఎంత హితబోధ చేసినా ఇవతల మనిషి విన్నాడుకాడు.

"కొండవాళ్ళనీ, కోయవాళ్ళనీ వెంటబెట్టుకుని దౌర్జన్యానికే దిగేడు. కాని ససేమిరా అహింసాత్మకంగా సంప్రతింపులకు వెళ్ళనన్నాడు. సరే దౌర్జన్యానికే దిగనీయండి. వీణ్ని వీడి కొండ వెధవల్ని, ముండ వీరుల్నీ నరికిపారేసి చెట్టుకొమ్మణ్ణి వ్రేలాడదీస్తేగాని ముందు ముందుకి ఇటువంటి వాళ్ళకి బుద్ధులావు? .... బావుంది బావుంది. ఇంతావిని వాడెవడనా అడుగుతావు?! వాడిపేరు రాముట్ట. అయోధ్యా రాముడట! వెళ్ళి పదిరోజులయింది. ఏమయిందో ఏమిటో ఇంకా సమాచారం అందలేదు. ఏమవుతుందిలే చస్తాడేకాని, రావణబ్రహ్మమీద తిరుగుబాటు లేవదీసి ప్రాణాల్తో పైకొస్తాడా!!

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 15-3-68*